


*ముంబయి వరుస పేలుళ్ల దుర్ఘటన కేసులో అయిదుగురు ముద్దాయిలకు శిక్షలు ఖరారు చేస్తూ ముంబయిలోని ప్రత్యేక టాడా కోర్టు తీర్పునిచ్చింది. 1993లో జరిగిన ఈ దారుణానికి బాధ్యులుగా గుర్తిస్తూ ఇద్దరికి మరణశిక్ష, మరో ఇద్దరికి ఆజన్మ కారాగార శిక్ష, ఇంకొకరికి 10 సం॥ల జైలుశిక్ష విధించారు.*

ముంబయి వరుస పేలుళ్ల దుర్ఘటన కేసులో అయిదుగురు ముద్దాయిలకు శిక్షలు ఖరారు చేస్తూ 2017 సెప్టెంబర్ 7న ప్రత్యేక టాడా కోర్టు తీర్పు చెప్పింది. 1993లో జరిగిన ఈ దారుణానికి బాధ్యులుగా గుర్తిస్తూ ఇద్దరికి మరణశిక్ష, మరో ఇద్దరికి ఆజన్మ కారాగారవాసం, ఇంకొకరికి 10 సం॥ల జైలుశిక్ష విధించింది. ఈ దారుణానికి కీలక సూత్రధారులైన తహీర్ మర్చంట్, ఫిరోజ్ అబ్దుల్ రషీద్ ఖాన్‌లకు మరణశిక్ష విధించారు. గ్యాంగ్‌స్టర్ అబూ సలేం, మరో ముద్దాయి కరీముల్లాఖాన్‌లకు జీవితాంతం జైలులో ఉండేలా శిక్ష వేశారు. అయిదో ముద్దాయి రియాజ్ సిద్దికీకి పదేళ్ల జైలు శిక్ష విధించారు. జైలు శిక్షతో పాటు మొత్తం అయిదుగురు నిందితులకు రూ.27.09 లక్షల జరిమానా విధించారు. ఫిరోక్‌కు రూ.4.75 లక్షలు, కరీముల్లాకు రూ.8.88 లక్షలు, తహీర్‌కు రూ.4.85 లక్షలు, అబూ సలేంకు రూ.8.51 లక్షలు, రియాజ్‌కు రూ.10 వేలు జరిమానా వేశారు. తగిన ఆధారాలు లభించకపోవడంతో మరో నిందితుడు



L to R: Abu Salem, Tahir Merchant, Feroz Abdul Rashid Khan, Karimullah Osan Khan, Riyaz Siddique

అబ్దుల్ ఖయ్యూం షేక్ (64)ను విడిచిపెట్టారు. అయితే నిందితునిగా ఆయన 11 ఏళ్ల పాటు జైలులో ఉన్నారు. సీబీఐ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీపక్ సాల్వి మాత్రం తహీర్, ఫిరోజ్‌లతో పాటు కరీముల్లాకు కూడా ఉరిశిక్ష వేయాలని కోర్టును కోరారు. ఈ కేసుకు సంబంధించి న్యాయస్థానం మొదట 2017 జూన్ 16న తీర్పు ఇచ్చింది. విధ్వంసానికి మరో సూత్రధారి అయిన ముస్తాఫా దోస్సాతో పాటు వీరందర్నీ దోషులుగా గుర్తించింది. తీర్పు వెలువడిన రెండు రోజులకే దోస్సా ముంబయిలోని జె.జె.ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించాడు. దాంతో ప్రస్తుతం ఆయనకు ఎలాంటి శిక్షా విధించలేదు. సంఘటన జరిగిన 24 ఏళ్ల అనంతరం తీర్పు వెలువడింది.

## తొలి మరణశిక్ష యాకూబ్ మెమన్‌కు అమలు

1993 మార్చి 12న ముంబయిలో కేవలం రెండు గంటల వ్యవధిలోనే 12 చోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ దుర్ఘటనలో 257 మంది ప్రాణాలు కోల్పోగా 713 మంది తీవ్రంగా గాయపడ్డారు.



ఈ పేలుళ్లలో మొత్తం 129 మందిని నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. తొలిదశ విచారణ 2006లో పూర్తయింది. సెప్టెంబరులో తీర్పు వెలువరించింది. 100 మంది దోషులని కోర్టు తీర్పు చెప్పింది. 12 మందికి ఉరి శిక్ష పడింది. అయితే టైగర్ మెమన్ సోదరుడు యాకూబ్ మెమన్‌కు మినహా మిగిలివారి శిక్షలను జీవిత ఖైదుగా తగ్గిస్తూ 2103లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. 2015 జులై 30న యాకూబ్‌కు ఉరి శిక్షను అమలు చేశారు. ప్రస్తుత కేసులో నిందితులుగా ఉన్న ఏడుగురిని 2003 నుంచి 2010 మధ్య కాలంలో అరెస్టు చేశారు. ఈ కేసును ప్రధాన కేసు నుంచి తప్పించి విడిగా విచారించారు. నిందితుల్లో దావూద్ ఇబ్రహీం, టైగర్ మెమన్, అనీస్ ఇబ్రహీంలతో సహా మరికొందరు ఇంకా పరారీలో ఉన్నారు.

## బాధితులకు పరిహారం చెల్లించండి

జరిమానాగా వసూలు చేసిన సొమ్ము బాధితుల పునరావాసానికి ఏమాత్రం సరిపోదని, అందువల్ల బాధితులకు తగిన పరిహారం చెల్లించాలని జడ్జి ఆదేశించారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సలహా సంస్థను సూచించారు. ఇందుకు సహకారం అందించాలని సీబీఐని కోరారు. ఈ కేసులో ఇంకా 33 మంది పరారీలో ఉన్నారని, వారి ఆస్తులు వేలం వేయడానికి చర్యలు తీసుకోవాలని సీబీఐని ఆదేశించారు.

## తప్పించుకు తిరుగుతున్న దావూద్ ఇబ్రహీం, టైగర్ మెమన్

257 మంది ప్రాణాలు బలిగొన్న ముంబయి పేలుళ్ల (1993)కు కుట్రపన్నిన వ్యక్తులు ఇప్పటికీ చట్టానికి దొరకుండానే తప్పించుకు తిరుగుతున్నారు. సుదీర్ఘ విచారణ క్రమంలో దాదాపు 100 మందికి టాడా కోర్టు శిక్షలు విధించింది. అయితే, ఈ విద్రోహ ఘటనకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న దావూద్ ఇబ్రహీం, అతని ప్రధాన అనుచరులు టైగర్ మెమన్, మహమ్మద్ అహ్మద్ ఉమర్ దోసా, జావేద్ చిక్నా తదితరుల జాడ తెలియలేదు. విచారణ జరపాల్సిన వ్యక్తుల జాబితాలో వీరి పేర్లున్నాయి.

## దావూద్ ఇబ్రహీం కస్కర్:



ఒక కానిస్టేబుల్ కుమారుడు. ముంబయి చీకటి సామ్రాజ్యంలో కింది స్థాయి నుంచి ఎదిగి మాఫియా డాన్‌లకే నాయకుడయ్యాడు. ముంబయి అధోజగత్తుకు కార్పొరేట్ సంస్కృతిని తీసుకొచ్చాడు. 1984లో దేశం విడిచి పరారయ్యాడు. ఆ తర్వాత ముంబయి వరుస పేలుళ్ల(1993)కు ప్రధాన కుట్రదారుగా వార్తల్లోకి ఎక్కారు. పాకిస్థాన్‌లోని కరాచీలో ఉంటున్నట్లు సమాచారం.

## ఇబ్రహీం అబ్దుల్ రజాక్ మెమన్ అలియాస్ టైగర్ మెమన్:



పాఠశాల స్థాయి విద్యను మాత్రమే అభ్యసించాడు. ముంబయి చీకటి సామ్రాజ్యంలోని ధనబలం, కండబలం ఆకర్షణకు గురయ్యాడు. 1992 దాడుల్లో తన కుటుంబం పడిన బాధలకు ప్రతీకారం తీర్చుకునేందుకు గాను ముంబయి వరుస దాడులకు సమన్వయకర్తగా పనిచేశాడు. అధోజగత్తులోని తన పరిచయాలను అడ్డుపెట్టుకుని దుబాయ్ మీదుగా పాకిస్థాన్‌కు చేరుకున్నాడు. ముంబయికి ఆర్డీఎక్స్‌ను దొంగచాటుగా చేర్చే ప్రణాళికను సమర్థంగా అమలుచేశాడు. దుబాయ్, పాకిస్థాన్‌ల మధ్య తరచూ తిరుగుతుంటాడని పోలీసు వర్గాల సమాచారం.

### మహమ్మద్ ఉమర్ అహ్మద్ దోసా:

1993 పేలుళ్ల కేసులో నిందితుడైన ముస్తాఫా దోసా(విచారణ సమయంలో మృతి చెందాడు) ఇతని సోదరుడే. పేలుళ్ల కుట్రదారులు దుబాయ్‌లో సమావేశమయ్యేందుకు మహమ్మద్ సహకరించాడనే ఆరోపణలున్నాయి. దోసా కంపెనీకి ఉన్న విస్తృత సంబంధాలను అడ్డుపెట్టుకునే టైగర్ మెమన్ పేలుడు పదార్థాలను ముంబయికి చేర్చాడని పోలీసు వర్గాల సమాచారం. హవాలా కార్యకలాపాలు నిర్వహించే ముగ్గురు ప్రపంచ ప్రముఖుల్లో మహమ్మద్ ఒకడు. దుబయిలో మారుపేర్లతో పలు ఆభరణాల దుకాణాలు నిర్వహిస్తున్నాడు.



### జావెద్ దావూద్ టైలర్ అలియాస్ జావెద్ చిక్నా:

1992లో జరిగిన ముంబయి దాడుల్లో తుపాకి గుండు తగిలి గాయపడ్డాడు. వాహనాల్లో పేలుడు పదార్థాలు అమర్చటంలో సిద్ధహస్తుడు. ముంబయి వరుస పేలుళ్ల కోసం వివిధ ప్రాంతాల్లో బాంబుల అమర్చటం ఇతని పర్యవేక్షణలోనే జరిగింది. పేలుళ్ల అనంతరం దుబాయ్‌కు పరారయ్యాడు. ప్రస్తుతం పాకిస్థాన్‌లోనే నివసిస్తున్నాడని సమాచారం.



### దావూద్ ఫణ్సే:

టైగర్ మెమన్ ఏజెంటు. దుబాయ్‌లో దావూద్‌తో భేటీకి సహకారం. ఇతని మనుషులే ముంబయికి పడవల్లో ఆర్డీఎక్స్‌ను చేరవేశారు.

### షరీఫ్ అబ్దుల్ గఫూర్ పార్కర్:

మారణాయుధాలు, పేలుడు పదార్థాలు చేరవేతలో దోషి. రాయ్‌గఢ్‌లోని ఇతని నివాసం టైగర్ మెమన్ స్మగ్లింగ్ కార్యకలాపాలకు స్థావరం. ఇదే కేసులో ఇతని కుమారుడు ముజిబ్‌ను కూడా కోర్టు దోషిగా తేల్చింది.

### ఆయుధాల రవాణాలో దిట్ట అబూ సలెం

అబూసలెం.. పేరుమోసిన గ్యాంగ్‌స్టర్. అధోజగత్తు నేత దావూద్ ఇబ్రహీంకు సన్నిహితుడు. ఆయుధాల అక్రమ రవాణాలో సిద్ధహస్తుడు. ముంబయి వరుస పేలుళ్ల కుట్రలో పాలుపంచుకొని.. భారీ సంఖ్యలో అమాయకుల దుర్మరణానికి కారణమయ్యాడు. తాజాగా న్యాయస్థానం అతడికి జీవితఖైదు ఖరారు చేసింది. అబూసలెం స్వస్థలం ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆజంగఢ్. చిన్నతనంలోనే అతడు తండ్రిని కోల్పోయాడు. దీంతో పొట్టకూటి కోసం కొన్నాళ్లు మెకానిక్‌గా పనిచేశాడు. అనంతరం ముంబయికి మకాం మార్చాడు. తొలినాళ్లలో అక్కడ టాక్సీ చోదకుడిగా పనిచేశాడు. క్రమంగా దావూద్ ఇబ్రహీం ముఠా(డి-కంపెనీ)తో సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. దావూద్‌కు భాగస్వామిగా ఎదిగాడు. అబ్దుల్ ఖయూమ్ అన్సారీ, ఆఖిల్ అహ్మద్ అజ్మి, కెప్టెన్, అబూ సమాన్ అనే పేర్లతోనూ అబూ చెలామణీ అయ్యేవాడు. 'టి-సిరీస్' యజమాని గుల్షన్ కుమార్ హత్య కేసులో అబూ దోషిగా తేలాడు. పలువురు బాలీవుడ్ ప్రముఖులపై అతడు బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి.

2001లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా చిరునామాతో తప్పుడు పేరు, వివరాలతో పాస్‌పోర్టులు పొందినందుకుగాను అబూ సలెంకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2013లో తీర్పు వెలువరించింది. వ్యక్తిగత విషయాలకొస్తే.. 1980ల్లోనే అబూకు వివాహమైంది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. బాలీవుడ్‌కు చెందిన మోనికా బేడితో 2000ల్లో అబూ సంబంధాలు నెరిపాడు. నకిలీ పత్రాలను సృష్టించిన కేసులో సలెం-బేడి జంట 2002లో పోర్చుగల్‌లో అరెస్టయ్యింది.

డి-కంపెనీలో అందరికీ అబూ సామాన్ అనే పేరుతో అబూ సలెం సుపరిచితుడు. ఆయా ప్రాంతాలకు తమ ముఠా అక్రమంగా చేరవేయాల్సిన ఆయుధాలను ఎల్లప్పుడూ సకాలంలో చేరవేస్తూ.. మంచి చోదక నైపుణ్యాలను కలిగి ఉండటంతో అతడికి 'అబూ సామాన్'గా పేరొచ్చింది. దీంతో 1993 జనవరిలో ఆయుధాలను గుజరాత్ నుంచి ముంబయికి అక్రమంగా తీసుకెళ్లే బాధ్యతనూ తమకు నమ్మకస్తుడైన అబూకే ముఠా అప్పగించింది. ఆ బాధ్యతను అబూ అత్యంత కచ్చితత్వంతో నెరవేర్చాడు. అధికారులకు ఏమాత్రం అనుమానం రాకుండా.. ఆయుధాలను ముంబయిలోని సంజయ్‌దత్ నివాసానికి చేర్చాడు.

అంతకుముందు ఎప్పుడూ నేరాలకు సంబంధించి అబూ పేరు బయటకు వినిపించకపోవడంతో.. ముంబయి పేలుళ్ల కేసులోనూ అతడిని పోలీసులు తొలుత అనుమానించలేదు. పేలుళ్ల కుట్రను ఛేదించిన నెల రోజులకు కూడా అబూపై వారికి అనుమానం రానే లేదు. అయితే, 1993 ఏప్రిల్ మూడో వారంలో పోలీసులు డి-కంపెనీకి చెందిన కొందరు వ్యక్తులను అంధేరీలో ప్రశ్నించారు. వారిలో

ఒకరు దావూద్ సహాయకుడు బాబా చౌహాన్‌కు సంబంధించిన విషయాలను బయటపెట్టాడు. వెంటనే పోలీసులు బాబాను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. అప్పుడే ఉగ్రదాడికి సంబంధించిన మరికొన్ని కుట్రకోణాలు వెలుగుచూశాయి. వాస్తవానికి పేలుళ్లతో పాటు విచక్షణరహితంగా కాల్పులు జరపాలని.. గ్రెనేడ్లు విసరాలని ముష్కరులు కుట్ర పన్నినట్లు తెలిసింది. (ఈ కుట్ర వాస్తవరూపం దాల్చలేదు) అందుకోసం గుజరాత్ నుంచి మారుతి ఓమ్ని వ్యాన్‌లో భారీమొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను ముంబయికి చేరవేసినట్లు వెల్లడైంది. ఈ సమాచారంతోనే ఉగ్ర కుట్రలో సంజయ్‌దత్ పేరు, వ్యాన్ చోదకుడు అబూసలెంతోపాటు మరో ఇద్దరి పాత్ర వెలుగుచూసింది. అయితే, అప్పటికే అబూ ఢిల్లీకి పారిపోయాడు. అక్కడి నుంచి ఆజంగఢ్ కూడా వెళ్లి ఆపై దుబాయ్‌కి వెళ్లాడు.

### పాస్‌పోర్టులు సమకూర్చిన తాహిర్

ముంబయిలో విధ్వంసం సృష్టించేందుకు టైగర్ మెమన్‌తో కలిసి తాహిర్ దుబాయ్‌లో ప్రణాళికలు రచించాడు. పలు కుట్ర సమావేశాలకు హాజరయ్యాడు. సాయుధ శిక్షణ కోసం పాకిస్థాన్ వెళ్లేలా పలువురిని ప్రేరేపించాడు. భారత్‌కు వచ్చేందుకు వీలుగా.. పాక్‌లో శిక్షణ పొందినవారికి కరీముల్లాఖాన్‌తో కలిసి తాహిర్ పాస్‌పోర్టులు సమకూర్చాడు. ఆయుధాల సమీకరణకు నిధులు సేకరించాడు. భారత్‌లో ఆయుధాల అక్రమ తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచించాడు.

### అప్రూవర్‌గా మారతానన్న ఫిరోజ్‌ఖాన్

దోసా ముఠాలో ఫిరోజ్ ఖాన్ ముఖ్యుడు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి సురక్షితంగా దిగుమతి అయ్యేలా(1993 జనవరి 9న) అలీబాఘ్, మాస్లాల్లో కస్టమ్స్ అధికారులతో అతడు సంప్రదింపులు జరిపాడు. విధ్వంసమే లక్ష్యంగా పలు కుట్ర సమావేశాల్లో పాల్గొన్నాడు. అప్రూవర్‌గా మారతానంటూ కేసు విచారణ చివర్లో మొరపెట్టుకున్నాడు. అయితే, కోర్టు అందుకు నిరాకరించింది. కేసుకు సంబంధించి తగినన్ని ఆధారాలు తమకు లభించాయని కోర్టుకు సీబీఐ తెలియజేయడమే అందుకు కారణం.

## ముంబయి వరుస పేలుళ్ల కేసు దర్యాప్తు ఇలా..

257 మంది అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. 713 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో పలువురు ఎప్పటికీ మామూలు స్థితికి చేరుకోలేకపోయారు. ఇక ఆస్తి నష్టం అపారం. 1993 నాటి ముంబయి పేలుళ్లు మిగిల్చిన వ్యథ ఇది. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకారంగా ముంబయిలో చోటుచేసుకున్న ఈ విధ్వంసం భారతావనికి తీరని శోకాన్ని మిగిల్చింది. మరోవైపు ఈ కేసు దర్యాప్తు మన పోలీసు వ్యవస్థకు సవాలు విసిరింది. అయితే, రాకేశ్ మారియా నేతృత్వంలోని దర్యాప్తు బృందం చాకచక్యంగా వ్యవహరించి.. దోషులను సమర్థంగా గుర్తించింది. ఎవరూ పట్టించుకోకుండా వేర్వేరు ప్రాంతాల్లో వదిలేసిన ఓ మారుతీ వ్యాను, స్కూటర్ ఆధారంగా కేసును ఛేదించింది.

వరుస పేలుళ్లు చోటుచేసుకున్న తీరు, విధ్వంసం కోసం వినియోగించిన విస్ఫోటక పదార్థాలు ముంబయి పోలీసులకు దర్యాప్తులో సవాల్‌గా నిలిచాయి. అప్పట్లో నగర పోలీసు కమిషనర్‌గా ఎ.ఎస్.సమ్రా ఉన్నారు. కేసు దర్యాప్తునకు 150కిపైగా సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన ఆయన.. ఆ బృందానికి అధిపతిగా రాకేశ్ మారియా అనే అధికారిని ఎంపిక చేశారు. రాకేశ్ అప్పుడు ట్రాఫిక్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం. రాకేశ్ ఎంపిక చాలామందికి ఆశ్చర్యం కలిగించింది.

తొలి సమావేశంలోనే తన బృందానికి పని విభజన చేశారు. నగరంలో అనుమానాస్పదంగా ఏం కనిపించినా తనకు చెప్పాలని ఆదేశించారు. అనంతరం తనకు అందిన వివరాలన్నింటినీ నిశితంగా పరిశీలించారు. ఒర్లిలోని సీమెన్స్ కర్మాగారం సమీపంలో ఎవరూ పట్టించుకోకుండా ఉన్న ఓ మారుతీ వ్యాను(ఇందులో ఆయుధాలు-పేలుడు పదార్థాలున్నాయి), నైగోన్ ప్రాంతంలో ఎవరో వదిలి వెళ్లిపోయిన ఓ స్కూటరు ఆయనకు అత్యంత అనుమానాస్పదంగా కనిపించాయి. దీంతో వాటి ఆధారంగానే దర్యాప్తులో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

ఒర్లిలో కనిపించిన మారుతీ వ్యాను మహిమ్ ప్రాంతంలోని అల్ హుస్సైనీ భవనంలో నివాసముంటున్న మెమన్ కుటుంబసభ్యులదిగా పోలీసులు నిర్ధారించుకున్నారు. రెండు రోజుల క్రితమే వారు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు గుర్తించారు. అనంతరం రాకేశ్ ఆ ఇంటిని పరిశీలిస్తుండగా.. ఓ గదిలోని రిఫ్రిజిరేటర్‌పై స్కూటర్ తాళం చెవి కనిపించింది. అది నైగోన్ ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న స్కూటర్ తాళానికి సరిపోయింది. దీంతో కేసు దర్యాప్తులో విజయవంతంగా తొలి అడుగు పడింది.

అనంతరం రాకేశ్ బృందం దర్యాప్తును మరింత ముమ్మరం చేసింది. దేశవ్యాప్తంగా 79 నగరాల్లో సోదాలు నిర్వహించి.. దాదాపు 180 మంది అనుమానితులను అరెస్టు చేసింది. అరెస్టైనవారిలో ఇద్దరు.. వరుస పేలుళ్ల కుట్రను కూలంకషంగా అధికారులకు వివరించారు. అప్రూవర్లుగా మారారు. దీంతో ఆ ఇద్దరూ 2007లో కేసు నుంచి విముక్తులయ్యారు. అప్రూవర్లలో ఒకరి పేరు జన్‌ఖాన్ ఉస్మాన్ ఖాన్ అలియాస్ బాద్‌షా ఖాన్.

## ఇలా ప్రణాళిక..:

శాంతాక్రుజ్ ప్రాంతంలో బాద్‌షా ఖాన్ స్థిరాస్తి వ్యాపారం చేసేవారు. టైగర్ మెమన్ అక్రమ రవాణా వ్యవహారాలతో అతడికి సంబంధం ఉంది. ముంబయిపై దాడి చేసేందుకు ఉద్దేశించిన బృందంలో తొలినుంచీ తాను సభ్యుడినని బాద్‌షా పోలీసుల ముందు ఒప్పుకున్నారు. బాంబుల తయారీ, పేలుళ్ల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ కోసం తాను పలువురితో పాటు పాకిస్థాన్‌కు వెళ్లానని కూడా తెలిపారు. శిక్షణ ముగించుకొని వచ్చిన అనంతరం.. టైగర్ మెమన్ తమతో సమావేశాలు నిర్వహించారని పేర్కొన్నారు. పేలుళ్లకు పాల్పడేందుకు గాను డజనుకు పైగా ప్రాంతాల్లో తాము రెక్కీ నిర్వహించామని వివరించారు. అనంతరం టైగర్ మెమన్ నివాసంలో తాము బాంబులను తయారుచేసుకున్నట్లు బాద్‌షా తెలిపారు. గ్రెనేడ్‌లతో దాడి చేయాల్సిందిగా తనకు బాధ్యత అప్పగించారని చెప్పారు. అయితే, ఒర్లిలో పేలుడు శబ్దం వినపడగానే.. దాడికి తెగబడకుండానే మారుతీ వ్యానును వదిలి భయంతో తాను పారిపోయానని వివరించారు. ఢిల్లీలోని ఓ హోటల్‌లో బాద్‌షాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## 1993 మార్చి 12న బాంబులతో దద్దరిల్లిన ముంబయి

దేశ ఆర్థిక రాజధాని ముంబయి చరిత్రలో అది చీకటి రోజు. 1993 మార్చి 12న నగరం వరుస బాంబు పేలుళ్లతో నిలువెల్లా కంపించిపోయింది. వీధులు మరుభూములుగా మారాయి. ప్రజల హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొంది. ఎటుచూసినా విధ్వంసమే. ఎక్కడ చూసిన శవాలే. శరీరమంతా గాయాలతో క్షతగాత్రులే. ప్రతి 10, 15 నిమిషాలకు ఒక బాంబు పేలుడు. రెండు గంటల వ్యవధిలోనే 12 వరుస పేలుళ్లు. మధ్యాహ్నం 1.29 గం.లకు మొదలైన ముష్కరుల క్షుద్రక్రీడ సాయంత్రం 3.40 గం.ల వరకూ కొనసాగింది. ముప్పు ఎటువైపు నుంచి వస్తుందో...ఏ క్షణంలో ఏమి జరుగుతుందో తెలియక ప్రజలు హడలెత్తిపోయారు. నగరానికి తలమానికం లాంటి భవనాలు, సందర్శనీయ ప్రాంతాలు, జనసమ్మర్థ ప్రాంతాలు, వ్యాపార,వాణిజ్య సముదాయాలు, హోటళ్లు లక్ష్యాలుగా ముష్కరులు చెలరేగిపోయారు. ఆనాటి వరుస పేలుళ్ల ఘటనలో 257 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా 713 మంది తీవ్రంగా గాయపడ్డారు. 28 కోట్ల విలువైన ఆస్తులు ధ్వంసమయ్యాయి. విద్రోహ శక్తులు ముంబయిని మరుభూమిగా మార్చేందుకు దేశంలోకి దొంగచాటుగా 3000 కిలోల ఆర్డీఎక్స్‌ను తీసుకొచ్చారని సమాచారం. దీనిలో 10 శాతం పేలుడు పదార్థాన్ని ఉపయోగించి ఉంటారని అంచనా. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఉగ్రదాడిలో ఇంత పెద్ద మొత్తంలో ఆర్డీఎక్స్‌ను వినియోగించటం ఇదే తొలిసారి. బొంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, కల్బాదేవి, శివసేన భవన్, నారిమన్ పాయింట్‌లోని ఎయిర్ ఇండియా భవనం, మహిమ్‌లోని మత్స్యకారుల కాలనీ, వర్లీ సెంచరీ బజార్, జవేరి బజార్, బంద్రాలోని హోటల్ సీరాక్ తదితర చోట్ల విద్రోహులు వాహనాల్లో, చెత్తకుండీల్లో రకరకాల పద్ధతుల్లో ఆర్డీఎక్స్ బాంబులు అమర్చి విధ్వంసకాండకు పాల్పడ్డారు.

## అబూసలెంను కాపాడిన పోర్చుగల్ ఒప్పందం



పేలుళ్ల కేసులో ముఖ్య కుట్రదారు, ఆయుధాలు, పేలుడు పదార్థాలను ముంబయి నగరానికి చేర్చటంలో కీలక పాత్రవహించిన గ్యాంగ్‌స్టర్ అబూసలెం మరణ దండనకు అన్నివిధాలా అర్హుడైన వ్యక్తే. సహ కుట్రదారులు తహిర్ మర్చెంట్, ఫిరోజ్ ఖాన్‌లతో సమానంగా అతనికీ ఉరిశిక్ష విధించాల్సి ఉంది. అయితే, ఆ శిక్ష నుంచి తప్పించుకోగలిగాడు. అతనికి జీవితాంతం జీవితఖైదుకు బదులుగా 24 ఏళ్ల యావజ్జీవ శిక్షనే టాడా కోర్టు విధించింది. దీనికి ప్రధాన కారణం దోషుల అప్పగింతకు సంబంధించి పోర్చుగల్‌తో మన దేశం చేసుకున్న ఒప్పందమే కారణం. ఈ ఒప్పందంలోని నిబంధనల ప్రకారం దోషులకు మరణదండన విధించరాదు. అలాగే 25 సం॥లకు మించి జీవిత ఖైదును విధించకూడదు. పోర్చుగల్ 1867లోనే మరణ దండనను రద్దు చేసింది. భారత్, పోర్చుగల్ మధ్య నేరగాళ్ల అప్పగింత ఒప్పందం 2007 జనవరిలో జరిగింది. ఆ ఒప్పందంపై అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, పోర్చుగీస్ అధ్యక్షుడు అనిబల్ కవాకో సిల్వా సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చటానికి 14 నెలల ముందు 2005 నవంబరు 11న పోర్చుగల్ అబూసలెంను మన దేశానికి అప్పగించింది. విదేశాలకు పరారైన నేరగాడు తనకు తానుగా లొంగిపోయినా, కేంద్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఆ దేశం అప్పగించినా అటువంటి వ్యక్తికి తీవ్రమైన నేరాల్లో దోషి అయినప్పటికీ ఉరిశిక్ష విధించరాదని దోషుల అప్పగింత చట్టం-1962లోని సెక్షన్ 34సి నిబంధన చెబుతోంది. అలాంటి వ్యక్తికి యావజ్జీవ శిక్షను మాత్రమే విధించొచ్చు.

vyoma Current Affairs K. Santhoshkumar

## కేసు విచారణ సాగిన తీరు

| | | | |
|---|---|---|---|
| 1993 | | | |
| | మార్చి12 | : | 12 వరుస పేలుళ్లతో ముంబయి దద్దరిల్లింది. ఈ పేలుళ్లలో 257 మంది దుర్మరణం పాలయ్యారు. 713 మంది గాయపడ్డారు. |
| | ఏప్రిల్ 19 | : | బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్(117వ నిందితుడు) అరెస్టయ్యారు. |
| | నవంబరు 4 | : | సంజయ్‌దత్ సహా 189 మంది నిందితులపై 10 వేలకుపైగా పేజీలతో కూడిన ప్రాథమిక అభియోగపత్రం దాఖలైంది. |
| | నవంబరు 19 | : | కేసు విచారణను సీబీఐకి అప్పగించారు. |
| 1995 | | | |
| | ఏప్రిల్ 10 | : | 26 మంది నిందితులను టాడా కోర్టు విడుదల చేసింది. మిగిలిన నిందితులపై అభియోగాలు దాఖలయ్యాయి. మరో ఇద్దరు నిందితులు అబూ అసిం అజ్మీ(సమాజ్‌వాదీ పార్టీ నేత), అమ్జద్ మెహెర్ బౌక్స్‌లకు కేసు నుంచి సుప్రీంకోర్టు విముక్తి కల్పించింది. |
| | ఏప్రిల్ 19 | : | తొలి దశ విచారణ ప్రారంభమైంది. |
| 2002 | సెప్టెంబరు 18 | : | పోర్చుగల్‌లోని లిస్బన్‌లో అబూ సలెంను అదుపులోకి తీసుకున్నారు. |
| 2003 | | | |
| | మార్చి 20 | : | దుబాయ్ నుంచి ఢిల్లీ చేరుకున్న నిందితుడు ముస్తాఫా దోసాను ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీబీఐ అరెస్టు చేసింది. |
| | సెప్టెంబరు | : | ప్రధాన విచారణ పూర్తయింది. ముంబయిలోని టాడా కోర్టు తీర్పును రిజర్వులో ఉంచింది. |
| 2004 | జనవరి 9 | : | ముస్తాఫా దోసాపై అభియోగాలు నమోదయ్యాయి. |
| 2005 | | | |
| | నవంబరు 11 | : | అబూసలెంను భారత్‌కు తీసుకొచ్చారు. |
| | డిసెంబరు 9 | : | అబూసలెంపై అభియోగాలు దాఖలయ్యాయి. |
| 2006 | | | |
| | జూన్ 13 | : | అబూసలెంపై విచారణను ప్రధాన విచారణ నుంచి వేరుచేశారు. |
| | సెప్టెంబరు 12 | : | మెమన్ కుటుంబంలో నలుగుర్ని టాడా కోర్టు దోషులుగా తేల్చింది. ముగ్గురికి మాత్రం కేసు నుంచి విముక్తి కల్పించింది. అనంతరం 12 మంది దోషులకు మరణశిక్ష ఖరారైంది. 20 మందికి జీవితఖైదు పడింది. ఇతర దోషులకు కోర్టు వేర్వేరు శిక్షలు విధించింది. |

| | | | |
|---|---|---|---|
| 2007 | ఫిబ్రవరి | : | ప్రధాన విచారణ ముగిసింది. ఏడుగురు నిందితులకు సంబంధించిన రెండో దశ విచారణ ప్రారంభమైంది. |
| 2013 | | | |
| | మార్చి 16 | : | సంజయ్‌దత్‌ను దోషిగా తేల్చడాన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో.. ఆయన లొంగిపోయారు. |
| | మార్చి 21 | : | టైగర్ మెమన్ సోదరుడు యాకూబ్ మెమన్‌కు విధించిన మరణశిక్షను సుప్రీం సమర్థించింది. 10 మంది దోషులకు విధించిన ఉరిశిక్షను మాత్రం జీవితఖైదుగా మార్చింది. 16 మంది దోషుల జీవితఖైదును సమర్థించింది. |
| | ఆగస్టు 13 | : | నేరస్థుల అప్పగింతకు సంబంధించి పోర్చుగల్‌తో మనదేశానికి ఉన్న ఒప్పందాన్ని ఉల్లంఘించేలా అబూసలెంపై దాఖలైన కొన్ని అభియోగాలను న్యాయస్థానం తొలగించింది. |
| 2015 | | | |
| | జులై 30 | : | పేలుళ్లకు కీలక కుట్రదారైన యాకూబ్ మెమన్‌కు విధించిన ఉరిశిక్షను అమలు చేశారు. |
| | డిసెంబరు 7 | : | రెండో దశ విచారణలో తుది వాదనలు ప్రారంభమయ్యాయి. |
| | 2016 జూన్ 8 | : | అప్రూవర్‌గా మారతానంటూ నిందితుడు ఫిరోజ్ అబ్దుల్ రషీద్ చేసుకున్న విన్నపాన్ని న్యాయస్థానం తిరస్కరించింది. |
| 2017 | | | |
| | మార్చి | : | విచారణ పూర్తయింది. |
| | జూన్ 16 | : | అబూసలెం, దోసా సహా ఆరుగురు నిందితులను టాడా న్యాయస్థానం దోషులుగా తేల్చింది. ఒకరికి కేసు నుంచి విముక్తి కల్పించింది. |
| | జూన్ 28 | : | గుండెపోటుతో ముంబయి ఆస్పత్రిలో దోసా మరణించాడు. |
| | సెప్టెంబరు 7 | : | ఫిరోజ్ అబ్దుల్ రషీద్ ఖాన్, తాహిర్ మెర్చంట్‌లకు న్యాయస్థానం మరణశిక్ష విధించింది. అబూసలెం, కరీముల్లాఖాన్‌లకు జీవితఖైదు.. రియాజ్ సిద్ధిఖీకి 10 ఏళ్ల జైలుశిక్ష ఖరారు చేసింది. |